క్లుప్తంగా

ప్రభుత్వ హైస్కూల్‌లో మాక్ పోలింగ్


ఎన్నికలను పరిశీలిస్తున్న ఎంఈఓ

పాల్వంచరూరల్: జగన్నాథపురం హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్) ఎన్నికలు జనరల్ ఎన్నికలు తలపించాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో జనరల్ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారో.. ఆ పద్ధతిలో స్కూల్ పీపుల్ లీడర్ ఎన్నికలను నిర్వహించారు. ఎంఈఓ శ్రీరామ్మూర్తి ఎన్నికలను పరిశీలించారు. బాలబాలికలకు వేర్వేరుగా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా 187 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

టేకులపల్లి: మానవ మనుగడకు మొక్కలు ఆధారమని పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని ఇల్లెందు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, టేకులపల్లి ఎంపీడీఓ మల్లీశ్వరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. ఎంపీఓ జక్కుల లక్ష్మీగణేష్ గాంధీ, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, కార్యదర్శి ప్రశాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సత్తా చాటాలి


మాట్లాడుతున్న హరిప్రియ

టేకులపల్లి: రాబోయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మద్రాస్‌తండా, బిల్లుడుతండా పంచాయతీల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. వరప్రసాద్, బోడ బాలు, బానోత్ కిషన్, రామ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేసులను రద్దు చేయాలి

ఇల్లెందు: ఇల్లెందు మండలం పాత పూసపల్లి గ్రామ పెద్దల మీద పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, కుల ఆచారాలకు కట్టుబాట్లకు కట్టుబడి ఉండాలని, సంప్రదాయాలను గౌరవించాలని తుడుందెబ్బ డిమాండ్ చేసింది. శుక్రవారం తుడుందెబ్బ నేతలు ఆర్‌అండ్‌బీ గెస్ట్ ఆవరణలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలను వెల్లడించారు. కుల బహిష్కరణలో వాస్తవం లేదన్నారు. ఇలాంటి ఆరోపణలు పునరావృతం కాకుండా ఆదివాసీలంతా ఐక్యంగా ఉండాలని కోరారు. ముక్తి రాజు, ఈసం వెంకటేశ్వర్లు, గుమ్మడి రాంకుమార్, రామ్మూర్తి, తాటి మధు, పులసం భద్రం, కొర్సా నరేష్ ముక్తి కోటేశ్వరరావు ఉన్నారు.

బీట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోండి..

పాల్వంచరూరల్: అప్పు చేసి సాగు చేసుకున్న పత్తి మొక్కలను పీకేస్తున్న దంతలబోరు బీట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. బంద్రుగొండ గ్రామ శివారులో శుక్రవారం పీకేసిన పత్తిపంట మొక్కలను పరిశీలించి మాట్లాడారు. రెండు వారాలుగా నిరుపేద రైతుల భూముల్లోని పత్తి మొక్కలను ధ్వంసం చేస్తున్న బీట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కళాశాల యాజమాన్యంపై..

జూలూరుపాడు: తరగతులు నిర్వహించకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న డిగ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు రామ్‌చరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. మాట్లాడుతూ... కనీసం కళాశాల బోర్డు లేకుండా ఒకరిద్దరు అధ్యాపకులతో కళాశాలను నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత సూచించారు. రాఘబోయినగూడెంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్తనమూనాలు సేకరించారు. డాక్టర్ కవిత మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

శంకుస్థాపనకే పరిమితం

- ప్రమాదకరంగా పెనుబల్లి వంతెన
- కొత్తవంతెనకు రూ.6.50 కోట్లు మంజూరు
- పనుల ప్రారంభంలో జాప్యం
- వరదలొస్తే గ్రామస్తులకు తప్పని ఇక్కట్లు


శిథిలావస్థకు చేరుకున్న పెనుబల్లి లోలెవల్ వంతెన

చుంచుపల్లి: కొత్తగూడెం – పెనుబల్లి గ్రామాలను కలిపే వారధి శిథిలావస్థకు చేరుకుని ఏళ్లు గడుస్తోంది. దీనిని పట్టించుకునే నాథుడే లేడు. మండలంలోని మేజర్ పంచాయతీల్లో ఒకటైన పెనుబల్లి గ్రామ ప్రజలకు ప్రతీ వర్షాకాలం వచ్చిందంటే వరదలతో అవస్థలు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామస్తులకు వారధి కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుబల్లి గ్రామంలో 2,000 వేల జనాభా. కొత్తగూడెం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామస్తులు ప్రతీ అవసరానికి రోజూ జిల్లా కేంద్రానికి రావాల్సిందే. పెనుబల్లి – కొత్తగూడెం పట్టణాల మధ్య వర్షాలు పడితే గోధుమ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇక్కడ గోధుమవాగుపై దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన లోలెవెల్ వంతెన రెండు గ్రామాల మధ్యన వారధిగా నిలుస్తోంది. నిత్యం గ్రామస్తులతో పాటు ఇతర అవసరాల నిమిత్తం దీని మీదుగా పలు రకాల వాహనాలు తిరుగుతుంటాయి. ప్రజలు సైతం కొత్తగూడెం పట్టణానికి రావాలంటే ఈ బ్రిడ్జి మీదుగా కాలినడకనే వస్తుంటారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. బ్రిడ్జి పైన ఎక్కడ పడితే అక్కడ గుంతలు తేలి బీటలు వచ్చాయి. వంతెన రోయిలింగ్ ధ్వంసమైంది. రెండేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు ఈ లోలెవెల్ వంతెన పూర్తిగా దెబ్బతిన్నది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపడమే ఆనవాయితీగా మారుతోంది. ఎట్టకేలకు ఈ మధ్యన అధికారులు అంచాలను పెంచి నివేదికలు ఇవ్వడంతో రూ. 6.50 కోట్లు మంజూరయ్యాయి. జిల్లా పర్యటనకు వచ్చిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గత నెలలో ఈ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ఇంచా ప్రారంభించలేదు.

వరదలు వస్తే ప్రజలకు అవస్థలు...

ప్రస్తుత వర్షాకాలం మొదలు కావడంతో మళ్లీ ప్రజలకు అవే అవస్థలు మొదలవుతాయనే ఆందోళనలో ఉన్నారు. భారీ వర్షాలు, వరదలకు పెనుబల్లి గ్రామానికి కొత్తగూడెం పట్టణానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతుంటాయి. ఆ సమయంలో అధికారులు స్పందించి లోలెవల్ వంతనను దాటకుండా చర్యలు తీసుకుంటారు. ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి రవాణా మార్గాన్ని మూసి వేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తారు. వరద తగ్గిన తరువాత రాకపోకలు సాగడం ఆనవాయితీగా మారుతుంటుంది. నాలుగేళ్ల క్రితం రూ.3.50 కోట్ల వ్యయ అంచనాలతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు దాన్ని పట్టించుకున్న పాపానపోలేదు. అయితే దీని అంచనా సామర్థ్యం అమాంతం పెంచిన ప్రతిపాదనలతో తాజాగా రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. కానీ పనుల ప్రారంభానికే ముహూర్తం ఎప్పుడు ఉంటుందో రోజులు లెక్క పెట్టాలి.

అధికారులు చొరవ చూపాలి..



పెనుబల్లి – కొత్తగూడెంలో – లెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం సీజన్‌లో వరదలతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు, వరదలతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఇక శిథిలావస్థకు చేరిన వంతెనపై ప్రజలు నడవాలంటేనే భయపడుతున్నారు. అధికారులు కొత్త వంతెన నిర్మాణానికి పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలి.

– కంటెం శ్రీనివాసరావు, పెనుబల్లి

త్వరలో ప్రారంభిస్తాం..



పెనుబల్లి లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం సీజన్‌లో దీనిపై నుంచి వరద నీరు పోవడం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతుంటారు. ఈ లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరడంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కొత్త వంతెన నిర్మాణానికి రూ.6.50 ప్రతిపాదనలను పంపగా మంజూరయ్యాయి. వర్షాకాలం ముగిసిన తరువాత పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– నాగేందర్, పీఆర్, డీఈ

విరివిగా మొక్కలు నాటాలి..


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనమే లక్ష్యంగా వన మహోత్సవం కార్యక్రమం చేపట్టిందని, ప్రతీ గ్రామంలో వన మహోత్సవం పండుగలా సాగాలని, ప్రభుత్వ లక్ష్యం ప్రకారం 18 కోట్ల మొక్కలు నాటాల్సి ఉందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో డివైడర్ల మీద పార్క్‌లో చెరువు కట్ట వెంట మొక్కలు నాటారు. మాట్లాడుతూ.. పర్యావరణం కాపాడటం అంటే విరివిగా మొక్కలు నాటి కాపాడటమేనని అప్పుడే ఆరోగ్యంగా ఉండగలమని అందరూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, డీఎస్పీ చంద్రభాను, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూర్య, డానియేల్, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, బోళ్ల సూర్యం, మండల రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం కృషి..

మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేయాలని, అనారోగ్యం బారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి మెటీరియల్ పంపిణీ చేశారు. గ్లౌజ్‌లు, యూనిఫాం, సబ్బులు, నూనెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానికులను ఇబ్బంది పెట్టొద్దు..

సింగరేణిలో భూమి పోగొట్టుకుని 30 ఏళ్లుగా పోరాడుతున్న సుందర్‌లాల్ లోథ్‌కు ఆరు నెలల క్రితం తానే స్వయంగా కొంత భూమిని సూచించానని, పోరాటం విరమించి ఆ భూమిలో సాగు చేసుకుంటున్న అతన్ని ఇబ్బందులు పెట్టొద్దని ఎమ్మెల్యే కోరం కనకయ్య తేల్చి చెప్పారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో సింగరేణి సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డితో ఎమ్మెల్యే చర్చించారు. ఇక మీదట సింగరేణి అధికారులు సుందర్‌లాల్ జీవనానికి ఎలాంటి ఆటంకం కల్పించకుండా చూడాలన్నారు. అదే విధంగా ఇల్లెందులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, ఓసీ మట్టి తొలుకునేందుకు సెక్యూరిటీ సిబ్బంది అడ్డు తగులుతున్నారని, భూములు కోల్పోయిన ఈ ప్రాంత ప్రజలు ఇళ్లు కట్టుకుంటుంటే కనీసం మట్టి కూడా ఇవ్వరా అంటూ సింగరేణి సెక్యూరిటీ అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్యే వెంట దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వంశీచంద్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే..

కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డిని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బానోతు రాంబాబు, మండల రాము, పులి సైదులు తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాలని కోరుతూ సమాచార హక్కు సాధన స్రవంతి సంస్థ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌టీఐ ఆక్టివిస్ట్ బొడికల ప్రేమ్‌దయాళ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారికి శుక్రవారం వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. పలు ప్రైవేట్ పాఠశాలలల్లో ప్లే గ్రౌండ్స్, ఫైర్ సేఫ్టీ లేవని తక్షణమే ఎంఈఓలు ప్రతీ పాఠశాలను తనిఖీ చేయించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసాల మురళీమోహన్, గంధ్ర జితేందర్‌రెడ్డి, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


మాట్లాడుతున్న డాక్టర్ దినేష్

టేకులపల్లి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యసిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి కందుల దినేష్ మాట్లాడుతూ.. జనాభా పెరుగుదల వల్ల ఆరోగ్యం, విద్య, ఉద్యోగావకాశాలపై ఒత్తిడి, పేదరికం, స్త్రీ పురుష నిష్పత్తిలో అసమతుల్యత, నగరీకరణ పెరగడం వంటి ఎన్నో దుష్పరిమాణాలను మన భారత దేశం ఎదుర్కొంటోందన్నారు. మెరుగైన భారత సమాజ నిర్మాణానికి, జనాభా నియంత్రణకు ప్రభుత్వం ఇచ్చే సూచనలు అందరూ పాటించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం అనేక కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వైద్యాధికారి కంచర్ల వెంకటేష్, హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవ, నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ, హెల్త్ ప్రొవైడర్లు ధరణి, శైలజ, అమూల్య పాల్గొన్నారు.

ఆయిల్‌పాం, మునగ సాగును ప్రోత్సహించండి..


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: గ్రామాలలో అయిల్‌పాం, మునగ సాగును ప్రోత్సహించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో ఆయిల్‌పాం, మునగ సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్న ఐదుగురు రైతులను ఎంపిక చేయాలన్నారు. వేజ్ సీకర్స్, స్వయం సహాయక సంఘాల సభ్యులలో ఇన్సూరెన్స్ లేని వారిని గుర్తించి పీఎం జేజేబీవై, ఎంఎస్‌బీవై పాలసీలలో సభ్యులుగా చేర్చాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా అమలవుతున్న స్వయం ఉపాధి, సంక్షేమ పథకాలపై విస్తతంగా ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఎం దుర్గారావు, ఎంపీఓ శంకర్, సెర్ప్ సీసీలు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి 'మహిళాశక్తి' తోడ్పాటు


మాట్లాడుతున్న ఏపీఎం దుర్గారావు

ఇల్లెందురూరల్: ఇందిరా మహిళా శక్తి పథకాలు స్వయం సహాయ సంఘాల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తాయని ఏపీఎం దుర్గారావు అన్నారు. తిలక్‌నగర్, విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామ సంఘాల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సాధించిన పొదుపు సంఘాల ప్రగతిని విశ్లేషించుకొని 2025లో సాధించాల్సిన ప్రగతి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు సంఘాలలో సభ్యులుగా లేని మహిళలను గుర్తించి నూతన సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీసీ స్వర్ణలత, గ్రామ సంఘం అధ్యక్షులు రమణ, వీఓఏలు నవ్య, ప్రమీల, వెంకటలక్ష్మి, సుల్తానా పాల్గొన్నారు.

గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన


నినాదాలు చేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేస్తున్న గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ సీఎంపీఎఫ్ పాసు పుస్తకాలను తక్షణమే అప్‌డేట్ చేసి ఇవ్వాలని ఏఐటీయూసీ రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు క్రిష్టాఫర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందు బంగ్లోస్ వద్ద సమస్యల పరిష్కారం కోసం గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన తెలిపారు.

నాయకులు మాట్లాడుతూ.. నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధంగా మార్చి1, 2025 నుంచి కనీస వేతనాలు సీఎంపీఎఫ్, బోనస్, హాస్పిటల్ సౌకర్యం, బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించటం తదితర విషయాల గురించి సర్క్యులర్ ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని, దీనిపై ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటేశ్వర్లు, ఆర్.రాము, కే.శేఖర్, విష్ణు, టి.రమేష్, షేక్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి..

కొత్తగూడెంఅర్బన్: వాతావరణ సమతుల్యం కొరకు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి విద్యాచందన అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం, కుంజ లక్ష్మీనర్సు మునగ ప్లాంటేషన్, హైస్కూల్‌లో జరిగిన ప్లాంటేషన్ కార్యక్రమాలలో ఆమె మొక్కలు నాటారు. వనమహోత్సవ కార్యక్రమం గురించి వివరించారు.

పుస్తకాల వితరణ

చుంచుపల్లి: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్ కాలనీలోని మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు శుక్రవారం నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్‌లు, షూస్, పెన్నులు, పెన్సిళ్లు, టైలు, బెల్టులు, ఐడీ కార్డ్‌లను అందించారు. ఎంఈఓ బాలాజీ, కొల్లు నాగేశ్వరరావు, సురేష్ కుమార్, వాసిరెడ్డి మురళి, దుగ్గరాశి వెంకన్న, సామినేని నాగేశ్వరావు, శివరామకృష్ణ, సీతారామ శాస్త్రి, రాజేంద్రప్రసాద్, పాండురంగారావు, కామేశ్వరరావు, సాయిబాబా, ధర్మారావు, మైనేని నాగేశ్వరరావు, గురుమూర్తి పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

జూలూరుపాడు: కొత్తూరు గ్రామ పంచాయతీ పెద్దహరిజనవాడలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎంలు తార, పార్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జూలూరుపాడు: రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జూలూరుపాడు మండల వ్యవసాయ అధికారి దీపక్ ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే భూధార్ సంఖ్య తప్పనిసరి అని, రైతులకు ఆధార్ కార్డు మాదిరిగానే భూధార్ సంఖ్య ఉంటుందన్నారు. భూమి హక్కులను ధ్రువీకరించే అధికారిక రికార్డుగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ విధానంతో రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ నెల 20న ఫార్మర్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొత్తగూడెం విద్యుత్ ఏడీఈ హేమచంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 – 11 గంటల వరకు బర్మాక్యాంపు, బాబూక్యాంపు, బర్లీఫీట్, సన్యాసిబస్తీ, మధురబస్తీ, బస్టాండ్ ఏరియా, పోస్టాఫీస్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సామూహిక సీమంతం

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు టేకులపల్లి సెక్టార్ బద్దుతండా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఘనంగా సామూహిక సీమంతం నిర్వహించారు. సెక్టార్ సూపర్ వైజర్ అనురాధ మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాహారం, ఆరోగ్య పరీక్షలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోండి..

జూలూరుపాడు: ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించేలా చర్య తీసుకోవాలని డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్ రావు సందర్శించారు. ఎంపీడీఓ, ఎంపీఓ, ఈజీఎస్ ఏపీఓ, టీఏలతో సమీక్ష నిర్వహించారు. వ్యక్తిగత ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతల పనుల వివరాలను ఉపాధి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసీరామ్, సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, టీఏలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రతీ నీటి చుక్క వృథా కాకుండా భూమిలో ఇంకిపోయే విధంగా చూడాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి సూచించారు. పెద్దమ్మతల్లి ఆలయం సముదాయంలో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద మంజూరైన డ్రెయినేజీ, సోక్ పిట్ గుంతల పనులను శుక్రవారం జెడ్పీ సీఈఓ ప్రారంభించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డీఈ రామకృష్ణ, ఏఈ శ్రీనివాస్, ఏపీఓ పోరండ్ల రంగా, ఈసీ పుల్లయ్య పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి


మాట్లాడుతున్న లక్ష్మయ్య

టేకులపల్లి: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో అధికారులు గిరిజన చట్టాలు 1/70, పెసా, అటవీ హక్కుల చట్టాలకు విరుద్ధంగా ప్రతీ మండలంలో గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సరైంది కాదని, వాటిని నిలిపివేయాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి సమ్మక్క సారక్క గద్దెల వద్ద జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతరులకు భూ భారతి పేరుతో తెల్ల కాగితాల మీద అమ్మకం కొనుగోలు పేరుతో రాయించుకుని పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇది 1/70 చట్టానికి విరుద్ధం కాబట్టి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని గిరిజనేతరులు ఇచ్చిన దరఖాస్తులను తిరస్కరించాలని కోరారు. ఆదివాసీలు దరఖాస్తు చేసుకున్న అన్ని ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఇల్లెందు కేంద్రంగా భారీ ర్యాలీ, సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దుగ్గారపు వీరభద్రం, వట్టం కన్నయ్య, పూనెం శ్రీనివాస్, ఈసం కృష్ణ, వరుస పుల్లయ్య, తాటి రవికుమార్, శెట్టిపల్లి శివ, జోగ దినేష్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించండి..

జూలూరుపాడు: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. హాస్టల్ వార్డెన్లు సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు కొనసాగిస్తూ సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సాయితేజ, రామ్‌చరణ్ తేజ, అనిల్‌కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఏ.వెంకటేశ్వర్లుకు, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లకుండా చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గుండాల సుజన్, కమల్, మహేష్, రవి, వెంకటేష్, సునీల్, యోగి, ఆదిత్య పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన


సుజాతనగర్: నిరసన తెలుపుతున్న నాయకులు

సుజాతనగర్: కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపులో భాగంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జిలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు భూక్యా రాజేష్ మాట్లాడుతూ... కార్మికుల హక్కులను హరించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కోడ్లను రూపొందించిందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో అజ్మీరా కళ్యాణ్, ధరావత్ నరేష్, భూక్యా చక్రవర్తి, నరేష్, దేవేందర్, సురేష్, భూక్యా గణేష్, బోడ హర్ష, బోడ గణేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ పోస్టులను భర్తీ చేయండి...

జూలూరుపాడు: ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడు హైస్కూల్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని, మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ చాంద్‌పాషా మాట్లాడుతూ... ఖాళీగా ఉద్యోగ పోస్టులు భర్తీ చేయడంతోపాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నప్పటికీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. పసుపులేటి పవన్, చాపలమడుగు హర్షవర్ధన్, జశ్వంత్, రుషి, సంపత్, వెంకట్, యాకుబ్‌పాషా, సుమన్, వెంకటేష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.